


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



- 101 -

## తీరని దాహం

"ఎడారీ.. ఓ ఎడారీ ఎందుకేడుస్తున్నావ్.."

"ఎందుకేంటి.. నాలుక తడుపు కోవాలంటే నీటి చుక్క కరువయింది. నా దాహం తీరేదెలా.."

"ఇంతమంది కద్దామాల (పని మనుషుల) కన్నీరు నీపై నదిలా ప్రవహిస్తోంది కదా.. నీ దాహమింకా తీరలేదా తల్లీ.."

"సంద్రాలు నా పైబడి ప్రవహించినా నా దాహం తీరనిది. నా తృష్ణ ఎన్నటికీ తరగనిది. నేను మండే ఎడారినోయీ పరదేశీ.." అంటూ నవ్వింది ఎడారి.

గల్ఫ్ దేశాలు. భూమినుండి పెల్లుబికే పెట్రోలు బావులతో, తులతూగే సిరి సంపదలతో, విలువైన కార్లు భవనాలతో, విమానాలనిండా పయనించి వచ్చే పని మనుషులతో, వారి సేవలతో, విస్తరిస్తున్న వ్యాపారాలతో విలాసవంతమైన జీవితాలను గడుపుతున్నాయి. ఓ వైపు అరేబియా సముద్రం, మరోవైపు అంతులేని ఎడారి. వీటి మధ్యలో చిన్న దేశాలుగా విస్తరించిన మధ్య ప్రాచ్యం సంపదలతో తులతూగుతోంది.

ఏడు అరబిక్ దేశాలూ ఒక యూనియన్ గా ఏర్పడి ఒకే మాటగా, ఒకే బాటలో నడుస్తూ గల్ఫ్ దేశాలుగా పిలవబడుతున్నాయి. ప్రపంచంలోని పేద దేశాల ప్రజలు ఇక్కడికి పని మనుషులుగా రప్పించబడుతున్నారు. ఇందుకోసం మధ్యలో ఏజంట్లు నిర్విరామంగా పని చేస్తున్నారు. అరబ్ షేకులకు, పని మనుషులకు మధ్య వారధులు ఈ ఏజెంట్లు. అటు ఇటూ మాయ మాటలు చెప్పి డబ్బును దోచుకునే నేర్పరులు వీళ్ళు.

గంజాయి వనం లాంటి వీరందరి మధ్యలో తులసి మొక్కలా కనిపిస్తుంది మాధవి. చీకటి బతుకులనెన్నో దీపమై వెలిగించిన మాధవి కథ విచిత్రమైనది.

కట్టుకున్న భర్తను నమ్మి కువైట్ కు వచ్చింది మాధవి. కానీ వాడు ఒట్టి మోసగాడు. జిత్తులు నేర్చినవాడు. అక్కడ

కువైట్ లో చిట్టీలు వేసాడు. అందరినీ ముంచాడు. అందిన చోటల్లా అప్పులు చేసాడు. అందినంత దోచుకుని చేతులెత్తేసాడు.

చివరికి భార్య అని కూడా చూడకుండా మాధవికి మాయ మాటలు చెప్పి ఆమెను ఒక షేకుకు పనిమనిషిగా అమ్మేసి అతడు ఇచ్చిన డబ్బును తీసుకుని ఇండియాకు పారిపోయాడు. అక్కడ వేరే పెళ్ళి చేసుకున్నాడు.

పాపం అప్పటికి మాధవికి లోకం గురించి తెలియదు. అమాయకురాలంటే అందరికీ అలుసే. అందరూ మోసం చేస్తారు. ఆమె ఖర్మ ఏంటో గానీ అక్కడ సెల్లార్లో ఆర్నెల్లు బంధింపబడి బలాత్కారానికి గురయ్యిందామె. సేటుకే కాదు వాడి స్నేహితులకు కూడా ఆమె శరీరం విందు భోజనంగా మారింది. ప్రతిరోజూ శరీరం పచ్చిపుండులా మారిపోయేది. ప్రాణం చావుకు దగ్గరగా వెళ్ళేది. ఏడ్చి ఏడ్చి గొంతెండిపోయేది. దు:ఖం నదిలా ప్రవహించేది. కన్నీటితో నేల తడిసిపోయేది. ఇక తన బ్రతుకు ఇలా ఎడారిలో ముగిసిపోతుంది అనుకునే సమయంలో ఏ దిక్కులేని ఆ చోట దేవునిలా కనిపించాడు సేటుకు స్నేహితుడొకడు. వాడొక్కడే సున్నితంగా కాస్త మనిషిలా అనిపించాడు. మనిషిగా ప్రవర్తించాడు. అందుకే ధైర్యం చేసి మొర పెట్టుకుంది. తనను విడిపించమని కాళ్ళు పట్టుకుని వేడుకుంది.

ఏ కళనున్నాడో ఆమె దీనస్థితికి చలించాడు అతడు. ఆమె కన్నీటికి అతడి హృదయం కరిగింది. ఒక రాత్రి ఎవరికీ తెలియకుండా అనుమానం రాకుండా మాధవిని అక్కడినుండి తప్పించాడు. తీసుకెళ్ళి హసన్ అనే ఒక ముసలి షేకు ఇంట్లో పనికి అప్పగించాడు. అంతటితో తాత్కాలికంగా మాధవి కష్టాలకు అడ్డుకట్ట పడింది.

అలా మరో ఆర్నెల్ల కాలం గడిచింది. హసన్ కు కువైట్ సిటీ ముర్కాబ్ లో బట్టల దుకాణం వుంది.

ఒకేసారి ఇద్దరు పనివాళ్ళు పని మానేయడంతో విధిలేక మాధవికి బురఖా వేసి ఆ దుకాణంలో కూర్చోబెట్టాడు కువైటు సేటు హసన్.

బయటి ప్రపంచాన్ని చూడటంతో మాధవికి ధైర్యం వచ్చింది. షాపులో బట్టలు కొనడానికి వచ్చి పోయే వాళ్ళతో పరిచయాలు ఏర్పడ్డాయి. బాబా హసన్ ముసలివాడవడంతో అంగడి మొత్తం మాధవికి అప్పగించి అపుడపుడూ వచ్చి చూసి వెళ్ళేవాడు. కొన్ని రోజుల్లోనే ఇండియాలోని తన ఊరి నుండి ఇద్దరు పనివాళ్ళను పిలిపించుకుంది. పేదవాళ్ళైన వారికి ఉపాధి చూపించి ఈ విధంగా సహాయపడింది మాధవి.

అంగడిలో మంచి సరుకు, అమ్మేందుకు సమర్థులైన పనివారు వుండటంతో ఆ ప్రాంతంలో బాబా హసన్ అంగడికి మంచి పేరు వచ్చింది. బాబా హసన్ సంతోషించాడు. మాధవికి జీతం పెంచాడు.

పక్కనున్న షాపును కూడా బాడుగకు తీసుకుని షాపును విస్తరించాడు. ఇంకో ఇద్దరు పనివాళ్ళను తన ఊరినుండి

రప్పించింది మాధవి. దీంతో ఊళ్ళో కూడా మాధవి పేరు మారుమ్రోగింది.
ఈ మధ్య కాలంలోని సంపాదనతో ఊళ్ళో ఇల్లు కట్టించుకుని పొలం కూడా కొనుక్కుంది మాధవి. ఊళ్ళోని పేద పిల్లల చదువులకు కూడా సహాయం చేయనారంభించింది.
ఊరి జనం మాధవిని గురించి మంచిగా మాట్లాడటం మొదలు పెట్టారు. మాధవి జీవితం నాశనం అయిందనుకుని బాధ పడిన ఆమె తల్లిదండ్రులు చాలా సంతోషించారు.
అప్పటికి మాధవి కువైట్ వెళ్ళి ఐదేళ్ళు కావడంతో ఒకసారి ఇంటికి వచ్చి వెళ్ళమని కోరారు.
సరేనని బాబా హసన్ కు చెప్పి ఒక నెల సెలవు తీసుకుంది. షాపును పనివాళ్ళకు అప్పగించి విమానం ఎక్కింది మాధవి.

ఎందుకో అప్రయత్నంగా కన్నీళ్ళు వచ్చాయి. అవి ఆనందంతోనే అని ఆమెకు అర్థమయ్యింది. ఎప్పుడో ఏ నేల మాళిగలోనో ఏ కామాంధుడి చేతిలోనో అర్థాంతరంగా ముగిసి పోవాల్సిన జీవితం ఈ రోజు కుదుటపడి నలుగురికి ఆదర్శంగా మారినందుకు సంతోషించింది మాధవి. అందుకే తనలాంటి అభాగ్యులు కనబడితే కాపాడాలని నిర్ణయించుకుంది.

విమానం దిగి ఊళ్ళోకి రాగానే జనం ఘన స్వాగతం పలికారు. మాధవి చేసే మంచి పనులను ఎంతగానో మెచ్చుకున్నారు. ఊరిని, జనాన్నీ చూసి సంతోషించింది మాధవి. తన జన్మ ధన్యమయ్యేలా తన గ్రామానికి తన వారికి ఉపయోగపడే పనులు చేయాలని నిశ్చయించుకుంది మాధవి.

ఒకరోజు వున్నట్టుండి ఊడి పడ్డాడు మాధవికి భర్త అనబడే ప్రబుద్ధుడు కుమార్. వాడిని, వాడి జ్ఞాపకాలను మూట కట్టి గతంలోకి తోసేసి మూతపెట్టిన మాధవి సడన్ గా వాడిని చూసి నిర్ఘాంతపోయింది.

మాధవి ఇండియాకు వచ్చినట్లు ఎలా తెలిసిందో మరి సరాసరి ఇంట్లోకి వచ్చి మంచం మీద కూర్చుని మాధవి అమ్మతో మాట్లాడసాగాడు.
"తాను మాధవికి భర్తనని మూడు ముళ్ళ బంధం తెగేది కాదని తన పరిస్థితులు బాలేక మాధవిని కువైట్ లో విడిచి ఇండియా రావాల్సి వచ్చిందనీ జరిగింది మర్చిపోయి సంసారం చెయ్యాలనీ భార్యగా అది మాధవి బాధ్యతనీ, తప్పదనీ" ధీమాగా చెప్పసాగాడు.

వాడు చేసిన తప్పుడు పనికి తను పడ్డ కష్టాలు, తన దయనీయమైన స్థితి గుర్తొచ్చి కడుపు మండింది మాధవికి. కట్టుకున్న భార్యను నిర్దాక్షిణ్యంగా కువైటు సేటుకు అమ్మేసిన వాడి దుర్మార్గానికి రక్తం మరిగింది. కళ్ళు చింత నిప్పులయ్యాయి. ఒక్కుదుటున మూలనున్న కర్రను అందుకుని "ఒరేయ్ ఆడంగి వెధవా.. నిన్ను నమ్మి పరదేశానికి వస్తే ఆడపిల్లను డబ్బుకు అమ్మేస్తావటరా.. నీకు బుద్ధి చెప్పాలిరా" అంటూ చితక బాదింది. వాడు తేరుకునేలోపు నాలుగు దెబ్బలు పడ్డాయి. భయపడి లేచి బయటికి పారిపోయాడు వాడు.
పోయాడులే అనుకుని నిశ్చింతగా వుంటే తిరిగి మరుసటిరోజు నలుగురు పెద్ద మనుషులను వెంటబెట్టుకుని వచ్చాడు వాడు. తాళి కట్టిన భార్యను కాపురానికి పంపించాలని వారి ద్వారా చెప్పించాడు. వాళ్ళు కూడా ఆడదానికి తప్పదని భరించాలని నీతులు చెప్పసాగారు. వాడి ధైర్యానికి విస్తుపోతూ మాధవి కువైట్ లో వాడు చేసిన  దౌర్భాగ్యపు పనిని వారందరికీ వివరించింది. అవాక్కయ్యారు వాళ్ళు. "బుద్ధి లేదా వెధవా" అంటూ తిరిగి వాడినే చివాట్లేసారు.

ఏదో ఒకటి తేల్చుకోవాలి అనుకుంది మాధవి. అలాంటి భ్రాష్టుడితో ఇక సంబంధం వద్దని అది ఎప్పటికైనా ముప్పనీ భావించి పోలీస్ స్టేషన్ కు వెళ్ళి తన సమస్యను వివరించింది. పట్టు వదలని విక్రమార్కునిలా నాల్రోజులు తిరిగి అక్కడే వారి మధ్యనే వాడితో తెగతెంపులు చేసుకుంది. వాడు చేసిన పనికి అందరూ చివాట్లు వేసారు. పోలీసులు రెండు దెబ్బలు వేసి బుద్ధి తెచ్చుకోమని హెచ్చరించారు. పీడ విరగడయింది ఇక తన బ్రతుకును సంతోషంగా గడపాలనుకుంది మాధవి.

తిరిగి కువైట్ కు వెళ్ళేటప్పటికి బాబా హసన్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వార్ధక్యంతో కూడిన నీరసంతో ఆయన షాపుకు కూడా రాలేకపోయాడు. వ్యాపారం పెరిగింది. ముర్కాబ్ ప్రాంతంలో మంచి పేరున్న షాపుగా అది గుర్తింపబడింది. బాబాకు వున్న ఒక్కగానొక్క కొడుకూ లండన్ లో స్థిరపడ్డాడు. ఇక ఏ సమస్యా లేదు. అందుకే ఒకరోజు బాబా హసన్ మాధవిని పిలిచి తన తదనంతరం షాపు మాధవికి చెందేట్లు పేపర్ రాసిచ్చాడు. మాధవికి ఏమీ అర్థం కాలేదు. తనేమిటి కోట్ల ఆస్థికి వారసురాలు కావడం ఏమిటి. ఇది నిజమా, కలా అనుకుంది. బాబాకు కూతురిలా అన్నీ తానై సపర్యలు చేసింది. ఆయన సంతోషించాడు.
సంవత్సరం తరువాత ఆయన తనువును చాలించాడు. కన్నతండ్రి తనను వీడిపోయినట్లుగా దు:ఖించింది మాధవి. బాబా పేరుతో వున్న షాపును అభివృద్ధి చేసి ఆయన పేరుతో మంచి పనులు చేయాలని నిర్ణయించుకుంది. రెండు గదుల ఆ షాపు ప్రస్తుతం పెద్ద మాల్ గా తయారయ్యింది. దాదాపూ వందమంది ఇండియన్ వర్కర్స్ అక్కడ పని చేస్తున్నారు. అందరినీ మాధవే పిలిపించింది. ఆమె వలన చాలామంది సంపాదించుకుని బాగుపడ్డారు.

అంతే కాదు ఇండియాలో కూడా సేవా సంస్థను స్థాపించి గుడి, బడి కట్టించింది. పేద పిల్లలకు చదువు, తిండి, వసతి గృహం ఏర్పాటు చేసింది. అసహాయులను ఆదుకుంది. కేన్సర్ రోగులకు సహాయం చేసింది.
వందలమందికి వీసాలు తీసి ఉపాధి చూపింది. ఏజెంట్ల చేతిలో మోసపోయి పనిలేక అసహాయులైన ఆడవారికి ధైర్యం చెప్పి ఆసరా చూపింది. అందుకే చుట్టుపక్కల గ్రామాల్లో మాధవి పేరును గొప్పగా చెప్పుకుంటారు. తమ జీవితాల్లో వెలుగు నింపినందుకు కొందరు చేతులు జోడించి దండం పెట్టుకుంటారు.
కొందరు మిత్రులు "ఇలాగే వుండి పోతావా పెళ్ళి చేసుకొని జీవితాన్ని ఆస్వాదించు. పిల్లా పాపలతో హాయిగా గడుపు" అని సలహా ఇవ్వడం మొదలు పెట్టారు.

ఆ సమయంలో అనుకోకుండా పక్క షాపింగ్ మాల్ లో మేనేజర్ గా పని చేసే అక్బర్ తో పరిచయం అయి అది ప్రేమగా మారింది. వ్యాపారానికి అతని సలహాలు అవసరం అయ్యాయి.
అతను మాధవి కంటే రెండేళ్ళు చిన్నవాడే. కానీ మంచి పర్సనాలిటీ కావడంతో అలా కనిపించడు. ఇద్దరి భావాలు కలవడంతో కువైట్ లోనే నిఖా చేసుకున్నారు.
అలా ఒడిదుడుకులకు గురైన మాధవి జీవితం ఒక తీరానికి చేరుకుంది. ఇప్పుడు మాధవి ముద్దులొలికే ఇద్దరు పిల్లలతో కువైట్ లోనే సుఖంగా జీవనం సాగిస్తోంది.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments